
# పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

■ ఓటర్ల దీవెనలతో మళ్లీ గెలుస్తాం ■ పటాన్‌చెరు నియోజకవర్గం బీఆర్‌ఎస్ కంచుకోట
■ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు, అక్టోబర్ 28 : సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎమ్మార్ కన్వెన్షన్ హాల్‌లో మండల స్థాయి బీఆర్‌ఎస్ శ్రేణుల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాలకు భరోసాను అందిస్తూ, ప్రతి పేదవాడి ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్న పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమం దేశానికే ఆదర్శమన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి పార్టీ కార్యకర్తలు, నాయకులు తీసుకుని వెళ్లాలన్నారు. దాదాపు రూ. 9వేల కోట్ల అభివృద్ధి పనులు చేశామని గర్వంగా చెప్పాలన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన వారికి కూడా మనం ఆదరించి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగ ముత్తంగి గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, గౌతమ్ తమ అనుచరులతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లోచేరారు. వారికి కండువా కప్పి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, ఎంపీపీ సుష్మా శ్రీవేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాండు, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఆత్మకమిటీ చైర్మన్ గడీల కుమార్ గౌడ్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, సర్పంచ్ ఉపేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జనరంజకంగా సీఎం కేసీఆర్ పాలన

■ కాంగ్రెస్ రైతు వ్యతిరేకి , బీజేపీది మతతత్వ ధోరిణి ■ ఆరెండు పార్టీలను ప్రజలు నమ్మొద్దు : ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నాగల్‌గిద్ద, అక్టోబర్ 28 : తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటేయ్యాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహిరెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఖూబాతాండ, మెగా నాయక్ తండా, గుర్‌సింగ్‌తండా, వాలు తండా, విఠల్‌తండా, సక్రునాయక్ తండా, శ్యామాక్‌తండాలో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలతో దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. సమీపంలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగడం లేదని, రాష్ట్రం లాంటి పథకాలు ప్రవేశపెడితే బాగుంటుందని అక్కడి ప్రజలు కితాబిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పండరి యాదవ్, కో–ఆప్షన్ సభ్యులు రఫిక్, వివిధ గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



ఖూబాతండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు



పాపన్నపేట మండలం ఎన్నికల ప్రచారంలో ప్రజలతో మాట్లాడుతున్న మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి

■ మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి
రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్
■ పల్లె పల్లెన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

పాపన్నపేట, అక్టోబర్ 28 : కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కష్టాలు మొదలవుతాయని బీఆర్‌ఎస్ మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. శనివారం మెదక్ మండల పరిధిలోని రాయిన్‌పల్లి, తిమ్మనగర్, మాల్కాపూర్‌తాండ, శివ్వాయిపల్లి, కొంటూరు, వెంకటపూర్, పాషాపూర్, ఖాజీపల్లి, తదతర గ్రామాల్లో బీఆర్‌ఎస్ మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేవలం మూడు గంటల కరెంటు వస్తుందని దీంతో రాష్ట్రం అధోగతి పడుతుందని వెల్లడించారు. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని ఏమి అభివృద్ధి చేసిందో చెప్పాలన్నారు. మైనంపల్లి హనుమంతురావు కొట్లాటలు పెట్టడం మల్కాజిగిరిలో నడుస్తదని, కానీ మెదక్ నియోజకవర్గంలో కుదరదన్నారు. ఇక్కడ ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని కోరుకుంటునట్లు చెప్పారు. మేము వచ్చి గొడవలు పెడాతం, కొట్లాటలు పెడతాం అంటే ఊరుకోమని హెచ్చరించారు. 20 ఏండ్ల నుంచి మెదక్ ప్రజలతో నాకు అనుబంధం ఉందని తాను ఎమ్మెల్యే అయినప్పటికీ ఎవరిని ఇబ్బందులకు గురిచేయలేదన్నారు.

### పల్లె పల్లెన ఘనంగా స్వాగతం

మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డికి మెదక్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. గిరిజన సాంప్రదాయ దుస్తులతో మాల్కాపూర్ తండాల్లో ఆమె ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గిరిజన మహిళలతో కలిసి పాటలు పాడుతూ ఆడారు. ఎమ్మెల్యే వెంట జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, ఎంపీపీ యమునా జయరాంరెడ్డి, వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు కిష్టయ్య, హవేళీఘన్‌పూర్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు , సర్పంచ్‌లు సిద్ధగౌడ్, సరోజామోహన్, మాధవి రవీందర్, లక్ష్మీ ఆంజనేయులు రాజ్యలక్ష్మీరవీందర్, స్వప్న సిద్ధిరాములు నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో శివాయిపల్లి, కొంటూరు, గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.



గిరిజన వేషధారణలో నృత్యం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి

# కాంగ్రెస్‌కు అధికారం కల్ల

■ ఆరు గ్యారెంటీలు ఇచ్చేదీలేదు.. వచ్చేది లేదు ■ జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



గౌసాబాద్ తండాలో ఎమ్మెల్యే మాణిక్ రావు ప్రచారం

జహీరాబాద్, అక్టోబర్ 28: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు ఇచ్చేదీలేదు.. రాష్ట్రంలో వచ్చేదిలేదు.. ప్రజలకు సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నదని జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు తెలిపారు. శనివారం మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్, గౌసాబాద్ తండాలో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. గౌసాబాద్‌కు ప్రక్కన ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది, అక్కడ ఆరు గ్యారెంటీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఓటర్లకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ఎన్నికల్లో ఓట్లు వేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. శాసన సభ ఎన్నికల్లో స్థానిక వ్యక్తిని ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. ప్రచారంలో టెలికం బోర్డు సభ్యులు, గిరిజన తండాల ఇన్‌చార్జి పవార్ శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు విజయ్‌మోహన్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మణిక్యమ్మ, మశ్చేందర్, చిరంజీవి, కుద్బోద్దీన్, నారాయణ, అనుషామ్మ, మంజుల, షీలా రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంరక్షణే ధ్యేయంగా కవాతు

టేక్మాల్, అక్టోబర్ 28 : త్వరలో జరగబోయే ఎన్నికల సమయంలో ప్రజలకు ఎలాంటి భయం లేకుండా వారి రక్షణే ధ్యేయంగా కవాతు నిర్వహించినట్లు అల్లాదుర్గం సీఐ జార్జ్ తెలిపారు. మండల కేంద్రమైన టేక్మాల్, పాల్వంచ గ్రామాల్లో సుమారు 70 మంది సీఆర్పీఎఫ్, పోలీసు సిబ్బందితో కలిసి గ్రామాల్లోని వీధులలో కవాతు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఎవరైనా 50 వేల పైచిలుకు నగదును తీసుకెళ్తే తగిన రుజువులు, రసీదు చూపించాలని వెల్లడించారు. రిజర్వ్ ఎస్సై అచ్యుతా రావు, టేక్మాల్ ఎస్సై రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



టేక్మాల్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు